"ఉత్తిష్ఠత!జాగృత!ప్రాప్యవరాన్నిబోధత"

కలియుగాబ్ది 5127

# హిందూ నగారా

మాసపత్రిక

సంపుటి 34 ❁ సంచిక : 02 ❁ శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ❁ మాఘ మాసం ❁ ఫిబ్రవరి 2026 ❁ పేజీలు : 16 ❁ విడిప్రతి : రూ 10



# వైభవంగా ఏకాత్మ మానవ దర్శన పునఃస్మరణ సభలు

రుషితుల్యుడు పండిత్ దీనదయాళ్ ఉపాధ్యాయ 1965లో విజయవాడలో జరిగిన భారతీయ జనసంఘ్ 12వ వార్షిక మహాసభలలో ఏకాత్మ మానవ దర్శన సిద్ధాంతాన్ని పరిచయం చేశారు. ఆ గొప్ప చారిత్రక సందర్భాన్ని స్మరించుకుంటూ, జనసంఘ్ ఆధునిక రూపం భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ శాఖ జనవరి 23, 24 తేదీలలో విజయవాడలో పునఃస్మరణ సభలు ఏర్పాటు చేసింది. నాటి చారిత్రక సన్నివేశానికి వేదిక అయిన మునిసిపల్ స్టేడియం గ్రౌండ్స్ (నేడు ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ క్రీడా ప్రాంగణం, బందర్ రోడ్డు)లోనే ఈ సభలు ఏర్పాటయ్యాయి. 1965 నాటి సభలకు ప్రత్యక్ష సాక్షులు ఆచార్య ముదిగొండ శివప్రసాద్, జూపూడి హైమవతమ్మ కూడా పాల్గొని సభకు వన్నె తెచ్చారు. జాగృతి వారపత్రిక, సారస్వత నికేతన్ (వేటపాలెం గ్రంథాలయం), ఇతర వనరుల ద్వారా సేకరించిన చిత్రాలతో అప్పటి సభా కార్యక్రమాల సన్నివేశాలను రూపుకట్టించారు. శ్రీకృష్ణదేవరాయ నగర్ పేరుతో నిర్మించిన నాటి సభావేదిక స్వాగత ద్వారాన్ని మరపిస్తూ అదే నమూనాను రమ్యంగా తిరిగి ఏర్పాటు చేశారు.




## ఏకాత్మ మానవ దర్శనం.. ఒక ఇజం కాదు.. ఒక నిజం

### ఆచార్య ముదిగొండ శివప్రసాద్



ఘట్‌కేసర్ (తెలంగాణ)లో ఆనాడు గురుకులం ఉండేది. అక్కడ ఒక శిబిరం నిర్వహించి, దీనదయాళ్‌ను ఆహ్వానించారు. ఆనాడు ఆయన తన ఉపన్యాసంలో ఏకాత్మ మానవ వాదం ప్రాథమిక అంశాల గురించి కొన్ని మాటలు చెప్పారు. అప్పుడు వారి పాదాల దగ్గర కూర్చుని వాటిని రాసుకుని తెలుగులోకి అనువదించాను. ఆనాడు తాను అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షునిగా ఎంపికైనందుకే సభల్లో పాల్గొన్నాను. ఆనాడు ఎవరు ఎక్కడ ఎలా ఆసీనులయ్యారో, ఎవరు హాజరయ్యారో ఇప్పటికీ నాకు గుర్తుంది. ఏకాత్మ మానవ దర్శనం ఒక ఇజం కాదు, నిజం. వికసిత భారత్‌కు అవసరమైనది ఈ దర్శనమే. మన పురాణాలు, ఇతర వాఙ్మయం చెప్పేది ఒక్కటే.. కలసి నడుద్దాం. మనుషులంతా ఒక్కటే అని. శరీరంలో ప్రాణం ఉంటుంది. దానినే విరాట్ అన్నారు దీనదయాళ్. మనిషికి కేవలం అన్నం ఒక్కటే అందిస్తే చాలదని, బుద్ధి కోసం సంస్కృతి కూడా అవసరమని చెప్పారాయన. భారత్‌తో పాటు ఈజిప్ట్, మెసపుటోమియా, చైనాల్లోనూ నాగరికత విలసిల్లింది. అవన్నీ కాలగర్భంలో కలసిపోయినా, భారత నాగరికత మాత్రం జీవించే ఉంది. ఆ నాగరికతా సారాన్నే దీనదయాళ్ తన ఏకాత్మ మానవ దర్శనంలో నిక్షిప్తం చేశారు. ధర్మార్థ కామ మోక్షాలనే అంశం ఆధారంగా దీనదయాళ్ తన సిద్ధాంతాన్ని నిర్మించారు. అందులో ఆధ్యాత్మిక భావనకు స్థానం ఇచ్చారు.

## అంత్యోదయకు పునాది దీనదయాళ్ చింతనే

### జి. కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి



పెట్టుబడిదారీ విధానమే శరణ్యమని కొందరు... సోషలిజమే ప్రగతికి ఏకైక సూత్రమని ఇంకొందరు... కమ్యూనిజం మాత్రమే విశ్వమానవాళి శ్రేయస్సును ఆశిస్తుందని మరికొందరు వాదులాడుకుంటూ 'మనిషి'ని మరచిపోయారు. ఆ సమయంలో దేశ సమస్యలకు దేశీయమైన పరిష్కారాలు మాత్రమే ఉండాలన్న వాస్తవిక దృక్పథంతో నాటి భారతీయ జనసంఘ్ అధ్యక్షులు పండిత్ దీనదయాళ్ ఏకాత్మ మానవ దర్శనం ప్రతిపాదించారు. అది ధర్మరాజ్యం గురించి చెబుతుంది. అంటే నిజమైన చట్టబద్ధ పాలన. దీనదయాళ్ చెప్పినది ఒక్కటే. పాలన అంటే సమాజంలోని అత్యంత పేదల సంక్షేమాన్ని మొదట పట్టించుకోవాలి. మనవైన భారతీయ విలువలకు, స్వదేశీ సిద్ధాంతానికి మనమంతా పునరంకితం కావాలని ఆయన అన్నారు. మనిషి కేంద్రంగా రూపొందిన తొలి సిద్ధాంతం అదే. అంత్యోదయ అందులో పరాకాష్ఠ. ఆర్థికవ్యవస్థ ద్వారా వచ్చే ఫలితాలు చిట్టచివర ఉన్నవారికీ చేరాలన్నదే దాని ఆశయం. మోదీ 12 సంవత్సరాల పాలనకు ఇదే పునాది. ఎవరూ ఆకలితో ఉండరాదని ఆయన స్పష్టం చేస్తూ ఉంటారు. ఐదేళ్ల పాటు ప్రతి పేద కుటుంబానికి ఐదు కిలోల బియ్యం పంపిణీకి ప్రేరణ అంత్యోదయ. స్వచ్ఛ భారత్‌లో భాగంగా 19 కోట్ల ఇళ్లకు మరుగుదొడ్ల నిర్మాణం పేద ఇంటి మహిళ ఆత్మ గౌరవం కోసం చేపట్టినది. జన్‌ధన్ ఖాతాలు, ఓబీసీలకు 10 శాతం రిజర్వేషన్, విశ్వకర్మ యోజన, ముద్ర యోజన ఇవన్నీ అంత్యోదయలో భాగం. దాని వెనుక ఉన్నది దీనదయాళ్ దృష్టి.

## మనది సనాతన సంస్కృతి

### బిఎల్ సంతోష్



దీనదయాళ్ ప్రతిపాదించిన ఏకాత్మ మానవ దర్శనం కేవలం ఒక పుస్తకం లేదా పత్రం కాదు. భారతీయ సమాజం యుగయుగాలుగా అనుసరిస్తున్న జీవన విధానం. భగవద్గీతకు వివిధ భాష్యాల తరహాలో దీనదయాళ్ ప్రస్తుత కాలానికి అనుగుణంగా దానిని అందించారు. ఏకాత్మ మానవ దర్శనం సిద్ధాంతాన్ని బీజేపీ స్వీకరించింది. ప్రధాని, 18 మంది ముఖ్యమంత్రులు దీనికి కట్టుబడి ఆచరిస్తున్నారు. 1992లో బ్రిటిష్ ఎయిర్‌వేస్ ప్రచురించిన 'హిస్టో-మ్యాప్' ప్రకారం ప్రపంచంలో అంతరించి పోకుండా కొనసాగుతున్న రెండు నాగరికతలలో ఒకటి చైనా కాగా, రెండవది భారతీయ హిందూ సంస్కృతి. మనది 'సనాతన' సంస్కృతి, దీనికి ఆద్యంతాలు లేవు. 'ఏకాత్మ మానవ దర్శనం ఇప్పటికీ సందర్భోచితం. భారతదేశ అతిపెద్ద పార్టీ దీన్ని సిద్ధాంతంగా స్వీకరించింది. ప్రపంచ సుస్థిరతకు సనాతన ధర్మం అవసరం. వ్యక్తి, సమష్టి (సమాజం), సృష్టి (ప్రకృతి), పరమేష్ఠి (పరమాత్మ) అనే నాలుగు అంశాల అనుసంధానమే ఏకాత్మ మానవ దర్శన సారం'. ఈ సిద్ధాంతం వేయేళ్ల తరువాత కూడా సమకాలీన సమస్యల పరిష్కారానికి ఉపకరిస్తుంది. ఇది నాగరికతకు మార్గదర్శి.

## చాలా దేశాలపై భారత్ ప్రభావం

### రామ్‌మాధవ్



భారతదేశం 1947లోనే ఆవిర్భవించిందని భావించరాదు. భారత్ అంటే కొన్ని వందల ఏళ్ల నాగరికత కలిగిన దేశం. ఆ నాగరికత ప్రభావం చాలా దేశాల మీద, ప్రాంతాల మీద కూడా ఉంది. వీరంతా కలసి ఉండాలని దీనదయాళ్ ఉపాధ్యాయ ఆకాంక్షించారు. భారత దేశ అభివృద్ధి అంటే పొరుగు దేశాల అభివృద్ధి కూడా. ఇంగ్లిష్‌లో రెండు ప్రయోగాలు ఉన్నాయి. ఒకటి ఎల్డర్ బ్రదర్. రెండు బిగ్ బ్రదర్. మనం ఉండాల్సింది ఎల్డర్ బ్రదర్ తీరులోనే. అందుకే నరేంద్ర మోదీ పొరుగుకు మొదటి ప్రాధాన్యం అన్నారు. చైనా సంబంధాల విషయంలో నెహ్రూ తప్పు చేశారన్నదే దీనదయాళ్ నిశ్చితాభిప్రాయం. చైనాతో వ్యవహారం అంటే కేవలం మాటలతో కూడిన దౌత్యమే సరిపోదు. ఆ దేశంతో సమానమైన సైనిక పాటవం ఉంటేనే సాధ్యం. ఇవి కూడా దీనదయాళ్ అభిప్రాయాలే. చైనా విషయంలో ఆయన దృక్పథం కాలపరీక్షకు నిలిచింది. మనం కూడా సైనిక పాటవం సాధించిన తరువాత మాత్రమే చైనా వెనక్కి తగ్గింది. నేడు ప్రపంచ దేశాలు, చాలా వ్యవస్థలు మారుతున్నాయి. అయినా భారత్ తనదైన ఉనికిని చాటుకో గలుగుతున్నది. దీనికి స్ఫూర్తి ఏకాత్మ మానవ దర్శనం.

## రక్షణ ఉత్పత్తులపై కొత్త వెలుగు

### డాక్టర్ సతీష్‌రెడ్డి



ఏకాత్మ మానవ దర్శనం భారత భద్రత, రక్షణ ఉత్పత్తులపై కొత్త వెలుగును ప్రసరించింది. భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చే నాటికి రక్షణ రంగంలో చెప్పుకోవడానికి మనదంటూ ఏం లేదు. 1965 నాటికి కొన్ని రక్షణ ఉత్పత్తులు చేసుకోవాలని ఆలోచన వచ్చింది. 2014లో దేశంలో రక్షణ ఉత్పత్తులు 23 శాతం. ఇప్పుడు 65 శాతం. దేశంలోనే ఉండి పనిచేయాలన్న తత్వం ప్రజల్లో వచ్చింది. గతంలో 75 శాతం భారతీయ నిపుణులు విదేశాలకు వెళ్లేవారు. ఇప్పుడు 75 శాతం మంది ఇక్కడే ఉండి పనిచేస్తున్నారు. దేశంలో ఈ రంగంలో పనిచేసే రెండు లక్షల స్టార్టప్‌లు వచ్చాయి. ఇందులో యువతదే ఎక్కువ భాగం.

## మన సంప్రదాయమే పునాదిగా...

### మురళీధరరావు



దీనదయాళ్ ఏకాత్మ మానవ దర్శనాన్ని ప్రతిపాదించిన సమయంలో వాదాలు ఒకదానితో ఒకటి సంఘర్షించుకుంటున్నాయి. కమ్యూనిజమే శాశ్వత సిద్ధాంతమని కొందరు నమ్మారు. కానీ ఇవాళ ఆ పేరే అంతర్ధానమై పోయింది. కమ్యూనిజమే కాదు, సామ్యవాదం, పెట్టుబడిదారీ విధానం కూడా కాలగర్భంలో కలసి పోవడం తథ్యమని చెప్పారు దీనదయాళ్. వాటికి ప్రత్యామ్నాయంగా భారతీయ సిద్ధాంత పరంపర ఆధారంగా, మన సంప్రదాయం సంస్కృతి పునాదిగా ఏకాత్మ మానవ దర్శనం ప్రతిపాదించారు. వాస్తవంగా మన పూర్వీకులు ప్రవచించిన విశ్వాసాలనే ఆయన రాజకీయ సిద్ధాంతంగా మలిచారు.

# ప్రాపంచిక సమస్యలన్నింటికీ పరిష్కారం

## విజయాదిత్య



భారతీయుల మనసుల్లో ఎలాంటి చింతన ఉన్నదో, శాంతి సౌభాగ్యాలను నిలిపిందో దానినే దీనదయాళ్ కాలానుగుణమైన ఒక రాజకీయ తాత్త్వికతగా మలిచి అందించారు. ఒకనాడు ఇక్కడున్న సిద్ధాంతానికే ఆధునిక దృష్టిని రంగరించారు. ఇది సామాన్య జనం ఆచరణ నుంచి ఆవిర్భవించింది. ఇది నేటి ప్రాపంచిక సమస్యలన్నింటికీ పరిష్కారం చూపగలదు. కలిసి సాధించడం, నడవడం అనే ధోరణి ఎంతోకాలంగా ఇక్కడ ఉంది. జేసీ బోస్ చిన్నతనంలో ఒక సంఘటన జరిగింది. ఆయన రాత్రివేళ బంతితో ఆడుతున్నారు. అది వెళ్లి మొక్కల మధ్య పడింది. ఆ బంతిని తెచ్చుకోవడానికి జేసీ బోస్ వెళుతుంటే, ఆయన మాతృమూర్తి వారించారు. రాత్రి మొక్కలు నిద్ర పోతాయి. నిద్రాభంగం చేయడం తప్పు అని చెప్పారు. మొత్తం సృష్టిలో వైవిధ్యం ఉంది. ఒకరి కష్టం అంటే భూమండలం మొత్తానికి వచ్చిన కష్టంగా చూడాలి. ఏకాత్మ మానవ దర్శనం మాతృభాషలను మన్నించమని చెబుతుంది. జాతీయ విద్యా విధానంలో ప్రాంతీయ భాషలకు విలువ ఇవ్వడానికి ఏకాత్మ మానవ దర్శనం ఇచ్చిన ప్రేరణే కారణం.

# ఆత్మ.. ఏకాత్మ.. భారతీయ మానసం..

## రాఘవకృష్ణ



ఏకాత్మ భారతదేశంలోనే సహజంగా ఉంది. సాటి మనుషుల పట్ల చూపవలసిన గౌరవంలో కూడా ఏకాత్మత కనిపిస్తుంది. ఆ మధ్య ఒరిస్సాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో ఎందరో కన్నుమూశారు. అంత్యేష్టి జరగపోతే సద్గతులకు ఆత్మ సాగించవలసిన ప్రయాణం ఆగిపోతుందని భారతీయుల విశ్వాసం. అందుకే ఆ ప్రమాదం జరిగిన 11వ రోజున చుట్టుపక్కల గ్రామాల వారంతా అక్కడకు వచ్చారు. మరణించిన వారందరికీ యథావిధిగా, శాస్త్రోక్తంగా శ్రాద్ధకర్మలను సామూహికంగా నిర్వహించారు. శాస్త్రోక్తంగా శ్రాద్ధకర్మ చేయడానికి నిష్ఠ, నియమం అవసరం. ఉపవాసం ఉండాలి. శిరోముండనం చేయించుకోవాలి. ఆ ప్రమాదంలో మరణించినవారి కులాల గురించి తెలియదు. గోత్రాలు అసలే తెలియదు. ఇతర మతాల వారూ ఉన్నారు. అయినా చుట్టుపక్కల గ్రామాల వారంతా వచ్చి ఆ నియమాలను పాటించి శ్రద్ధగా అంత్యేష్టి నిర్వహించారు. అలాంటి ఒక కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించలేదు. లేదంటే ఏదో సంఘం వచ్చి ప్రేరేపించలేదు. ఏ పీఠాధిపతి ఆదేశించలేదు. స్వచ్ఛందంగా వారే కూడబలుక్కుని వచ్చారు. అందుకే ఈ చర్యలో చాలామంది భారతీయ మానసాన్ని దర్శించారు. మన రక్తసంబంధీకులు మరణిస్తే ఎలాంటి గౌరవ ప్రతిపత్తులతో వారిని సాగనంపుతామో, సద్గతులు కలగాలని కోరుకుంటామో, అదే గౌరవం ఇతరులకూ దక్కాలన్న గొప్ప దృష్టి ఆ గ్రామీణుల హృదయాలలో ఉంది. ఏకాత్మత అంటే ఇదే కదా!

# ప్రపంచ శ్రేయస్సును కోరే సిద్ధాంతం

## కనగసభాపతి



దీనదయాళ్ తన సిద్ధాంతాన్ని ఆవిష్కరించి నప్పుడు మూడో సిద్ధాంతానికి చోటులేదనే అంతా భావించారు. ఏకాత్మ మానవ దర్శనం అంటే మనదైన నాగరికత, మనదైన ఆర్థిక చరిత్ర సారం కలిపి రూపొందించినది. ఒకప్పుడు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత జీడీపీ 32.9 శాతం. స్వతంత్ర భారతదేశం తొలి రోజులలో అది కేవలం 4 శాతమే. 1765–1900 మధ్య భారత్ నుంచి రూ 6.84 లక్షల కోట్ల సంపద తరలిపోయింది. ఇంత సంపదను సృష్టించుకోవడానికి కారణం వికేంద్రీకరణ. మన పూర్వులు మనకు పొదుపును వరంగా ఇచ్చారు. 1947 నాటికి దేశంలో సగం దారిద్ర్య రేఖ దగ్గరే ఉన్నారు. అయినా ఆనాడు ఉన్న పొదుపు 9 శాతం. తర్వాత 30 ఏళ్లలో అది 15 శాతానికి పెరిగింది. కాబట్టే దీనదయాళ్ మన దేశ అభివృద్ధికి మనదైన పంథానే అనుసరించాలని గాఢంగా ఆకాంక్షించారు.

# మేనమామకో ఉత్తరం

## డాక్టర్ వడ్డి విజయసారథి



అత్యంత సాధారణ కుటుంబం నుంచి వచ్చారు దీనదయాళ్ ఉపాధ్యాయ. ఆయన జీవితాన్ని ఆర్ఎస్ఎస్‌కు అంకితం చేసిన సమయంలో తన మేనమామకు ఒక లేఖ రాశారు. అందులో ఆయన రాసిన ఒక అంశం చిరస్మరణీయమైనది. మునిగిపోవడమే తరువాయి అన్నట్టు అస్తవ్యస్తంగా ఉన్న సమాజంలో పునరుత్తేజం తేవడానికి ఉపయోగపడే గొప్ప ఆవిష్కరణ చేశారు. అదొక చిన్న కథ వంటిదే. గొప్ప నిధిని పట్టుకుని ఒక వ్యక్తి పడవ ఎక్కాడు. కొంతదూరం ప్రయాణించిన తరువాత పడవలోకి హఠాత్తుగా నీరు రావడం మొదలయింది. రాను రాను పడవకు ప్రమాదం పెరుగుతున్నది. అప్పుడు ఆ గొప్ప నిధిని ఎక్కడ దాచగలడు? ఎలా రక్షించగలడు? భుజం మీద పెట్టుకుంటాడా? నెత్తి మీద ఉంచుకుంటాడా? లేదంటే అంగీ వెనుక దాస్తాడా? నిజానికి ఆ ఆలోచనలేవీ ఆ సమయంలో ఆ నిధిని రక్షించగలిగేందుకు ఉపకరించేవి కావు. నిధిని రక్షించుకోవాలంటే ఒక్కటే మార్గం. పడవలోకి నీరు రాకుండా ఆపడమే. అందుకు తగ్గ చర్యలకు ఉపక్రమించడమే. ఇప్పుడు దేశంలో జరగవలసినది కూడా అదే అని ఈ కథ ద్వారా పండిత్ దీనదయాళ్ తన మేనమామకు తెలియచేశారు.

## వైభవోపేతమైన భారత్ నిర్మాణమే లక్ష్యం

### శివప్రకాష్



ఇది కేవలం ఒక ప్రదర్శన కాదు, మన సిద్ధాంత వికాస పరిణామ క్రమాన్ని పునశ్చరణ చేసుకునే అద్భుత అవకాశం. 1952 నుంచి 2025 వరకు భారతీయ జనసంఘ్, భారతీయ జనతా పార్టీ సాగించిన ప్రయాణం ఎన్నో సంఘర్షణలు, బలి దానాలు, విజయాల సమాహారం. దీనదయాళ్ ఉపాధ్యాయ కలలుగన్న 'గతం కంటే వైభవోపేతమైన భారత్'ను నిర్మించడమే మన లక్ష్యం. స్వామి వివేకానంద చెప్పినట్లు, ప్రపంచానికి శాంతి, ప్రేమ, సహనం, సమన్వయ సందేశాన్ని అందించడం కోసం భారత్ శక్తిమంతంగా ఎదగడం అనివార్యం. ప్రపంచంలోని ఇతర దేశాలకు భిన్నంగా, భారత్ మాత్రమే సమస్త చరాచర జగత్తును తన కుటుంబంగా భావిస్తుంది. 'వసుధైవ కుటుంబకం', 'సర్వేభవంతు సుఖినః' అనేవి మన మూలసూత్రాలు. మానవ క్షేమమే కాదు, ప్రకృతిని, జంతుజాలాన్ని గౌరవించే సంస్కృతి మనది. ఈ ఉన్నతమైన భావనలు ప్రపంచంలో నిలవాలంటే భారత్ శ్రేష్టమైన దేశంగా నిలవాలి. కుటుంబ రాజకీయాల నుంచి విముక్తి పొంది, ఏకాత్మ మానవ దర్శనం ప్రాతిపదికన దేశాన్ని ఏకం చేయాలి. 2047 నాటికి 'వికసిత్ భారత్' సాధనే మన లక్ష్యం. అటల్ జీ చెప్పినట్లు, ఎన్ని అడ్డంకులు ఎదురైనా, ప్రళయ మేఘాలు కమ్ముకున్నా, మనం కలిసికట్టుగా అడుగులో అడుగు వేస్తూ విజయపథంలో సాగాలి.

## ప్రాపంచిక సమస్యలన్నింటికీ పరిష్కారం

### అర్జున్‌రామ్ మేఘావల్, కేంద్ర మంత్రి



ఏకాత్మ మానవత దర్శనాన్ని దీనదయాళ్ ఇస్తే, ప్రధానమంత్రి మోదీ సంక్షేమ పథకాల ద్వారా దానిని ఆచరణలో పెడుతున్నారు. విజయవాడ గడ్డ పవిత్రమైనది. ఇక్కడ వేదికపై అలంకరించి నట్లుగా వ్యక్తి, కుటుంబం, సమాజం, దేశం, మానవత్వం అన్నీ ఒకే మాలలో ఉంటాయి. 1980లో అటల్ బిహారీ వాజపేయి ముంబైలో చెప్పినట్లు 'చీకటి విడిపోతుంది, సూర్యుడు ఉదయిస్తాడు, కమలం వికసిస్తుంది'. ఆ మాటను నిజం చేస్తూ విజయవాడ మార్గం చూపింది. నేను రాజస్థాన్ వాసిని. దీనదయాళ్ ఉపాధ్యాయ కూడా రాజస్థాన్‌లోని పిలానీలో విద్యాభ్యాసం చేశారు. అక్కడ ప్రచారంలో ఉన్న ఒక గాథ ద్వారా 'ఏకాత్మ మానవ దర్శనం' ప్రభావం గురించి వివరిస్తాను. దీనదయాళ్ విద్యార్థిగా ఉన్నప్పుడు ఒక పెళ్లికి వెళ్లారు. అక్కడ మిఠాయిలు వండే వ్యక్తిని, ఆసనాలు ఏర్పాటు చేసిన వ్యక్తిని, బూట్లు పాలిష్ చేస్తున్న వ్యక్తిని, బట్టలు ఇస్త్రీ చేసే వ్యక్తిని... 'ఎవరి కోసం ఈ పనులు చేస్తున్నారు?' అని అడిగితే, వారందరూ 'మా ఊరి అమ్మాయి పెళ్లి, మా ఊరి అమ్మాయి అంటే ఈమె నా కూతురే' అని సమాధానం ఇచ్చారు. వృత్తులు వేరైనా, ఊరంతా ఏకమై ఒక అమ్మాయిని సొంత కూతురిలా భావించడమే 'ఏకాత్మ దర్శనం'. వ్యక్తి, కుటుంబం, సమాజం, దేశం, మానవత్వం.. ఇవన్నీ ఒకే సూత్రంతో ముడిపడి ఉన్నాయి. ఇదే 'ఏకాత్మ మానవ దర్శనం'.

## ప్రత్యేక సంచికల ఆవిష్కరణ

ఏకాత్మ మానవ దర్శనం పునర్దర్శనం సందర్భంగా జాతీయ వారపత్రిక 'జాగృతి' వెలువరించిన ప్రత్యేక సంచికను బీఎల్ సంతోష్ ఆవిష్కరించారు. 1965 నాటి అద్భుత జ్ఞాపకాలతో ఉన్న స్మరణికను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. జాగృతి నుంచి సేకరించిన 1965 నాటి పలు క్లిప్పింగ్‌లను ప్రత్యేక సంచికగా వెలువరించారు.




## అలరించిన ఎగ్జిబిషన్



పత్రికలు, గ్రంథాలయాల నుంచి సేకరించిన 1965 నాటి సభల సన్నివేశాలతో రూపొందించిన ఆడియో విడియో ప్రదర్శన ఉత్తేజకరంగా ఉంది. లక్నోలో ఒక బీజేపీ కార్యకర్త ఎంతో భక్తిగా దాచుకున్న దీనదయాళ్ ఆడియో సేకరించి, ఏఐ సాయంతో విజయవాడలో గతంలో ఆయన అన్న మాటలకు అన్వయించి సాక్షాత్తు దీనదయాళ్ నేటి తరాన్ని ఉద్దేశించి ప్రసంగించిన అనుభూతికి కలిగించే ప్రయత్నం స్వాగతించదగినది. జనవరి 23 ఉదయం 9.30 గంటలకు కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి దీనదయాళ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

## వికేంద్రీకరణతోనే అందరి శ్రేయస్సు సాధ్యం

### కస్తూరి రాకాసుధాకరరావు



ఉద్యోగాలను తొలగించే పారిశ్రామికీకరణకు దీనదయాళ్ వ్యతిరేకి. సగటు ప్రజలు, వారి దక్షత, సృజన ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తాయని తమ సిద్ధాంతంలో పేర్కొన్నారు. ఆయన రచించిన 'టు ప్లాన్స్' (రెండు ప్రణాళికలు) పుస్తకాన్ని అందరూ చదవాలి. సోవియెట్ నమూనా ప్రణాళికా వ్యవస్థను భారత్‌లో అమలు చేయదలచిన నెహ్రూ ఏ విధంగా విఫలమైనదీ అందులో విశ్లేషించారు. సగటు మనిషి లేదా సమాజంలోని చిట్టచివరి వ్యక్తి అభివృద్ధే దీనదయాళ్ ఆలోచన అంతటికీ కేంద్ర బిందువు. వికేంద్రీకరణతోనే అందరి శ్రేయస్సు సాధ్యమవుతుంది. 1980లో రాజస్థాన్‌లో నాటి ముఖ్యమంత్రి భైరాన్‌సింగ్ షెకావత్ మొదటిసారి అంత్యోదయ పథకం ప్రవేశపెట్టారు. అది మంచి ఫలితాలను ఇచ్చింది. దానికి ప్రేరణ దీనదయాళ్ సిద్ధాంతమే.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీసుకున్న కొన్ని ప్రధాన పథకాలకు మూలం దీనదయాళ్ సిద్ధాంతమే. స్వచ్ఛ భారత్, అంత్యోదయ ఆ సిద్ధాంతంలో భాగమేనని గుర్తుచేశారు. పోషణ్ అభియాన్ కూడా ఆ సిద్ధాంతం ప్రేరణతో తీసుకున్నదే.

**– అతుల్‌జైన్**



ఆరు దశాబ్దాల క్రితం ప్రపంచం దారుణమైన సిద్ధాంత రాద్ధాంతంలో కూరుకుపోయింది. కమ్యూనిజమే అంతిమ సత్యమన్నమన్నది ఒక శిబిరం. పెట్టుబడిదారీ విధానానిదే అంతిమ సత్యమని మరొక శిబిరం విజృంభించిన సమయమది. ఈ రాద్ధాంతంలో మనిషితనం తప్పిపోయింది. నైతిక సామాజిక విలువల మధ్య శతాబ్దాల పాటు మానవాళి బుద్ధిని భద్రంగా ఉంచిన ఆధ్యాత్మిక చింతన అపహాస్యానికి గురైంది. ఈ గందరగోళానికి కారణం ఆ సిద్ధాంతాలు ఘర్షణను నమ్మడమే. ఆచరణలో ఆరు లేదా ఏడు దశాబ్దాలు మాత్రమే రాజ్యమేలి నిష్క్రమించాయి అవన్నీ. ఈ పరిస్థితిని ముందే ఊహించింది ఏకాత్మ మానవ దర్శనం. అందుకే ఏకాత్మ మానవ దర్శనం విశ్వానికి ఒక శాశ్వత పరిష్కారం.

**– పి.వి.ఎన్. మాధవ్**

## బీజేపీకి పునాది జనసంఘ్

### వినయ్ సహస్రబుద్ధే



భారతదేశంలో దాదాపు 3వేల రాజకీయ పక్షాలున్నాయి. వాటిలో బీజేపీ ప్రత్యేకమైనది. ఎందుకంటే ఇందులో మన మట్టి వాసనలు ఉన్నాయి. ఈ పార్టీ విచార ధార ఏమిటి? ఎలాంటిది? దానికి చాలా కోణాలు ఉన్నాయి. బీజేపీకి పునాది జనసంఘ్. జనసంఘ్ ద్వారా బీజేపీకి లభించినదే ఏకాత్మ మానవ దర్శనం. ఇందులో నాలుగు మౌలికాంశాలు ఉంటాయని ఇంతవరకు అంతా చెప్పారు. అవి ధర్మార్థ, కామ, మోక్షాలు. ఇంకా స్వదేశీ ఉంది. స్వధర్మం, స్వభాష, స్వభోజనం, ఇంకా స్వభూష ఉన్నాయి. మనం మానవ సంబంధాల యుగంలో ఉన్నాం. వ్యక్తి, సమాజం, దేశం ఒకే వ్యవస్థలో భాగమన్నారు దీనదయాళ్. ఈశాన్య భారత రాష్ట్రాలను చిరకాలం పరాయిగానే నాటి ప్రభుత్వాలు భావించాయి. కానీ వాజపేయి తొలిసారి ఈశాన్య భారత రాష్ట్రాల అభివృద్ధి మండలిని ఏర్పాటు చేశారు. అందరినీ కలుపుకొని వెళ్లాలన్న ఏకాత్మతకు ఇది ప్రతిబింబం. నరేంద్ర మోదీ సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్ అన్న నినాదం వెనుక ఉన్నది కూడా ఏకాత్మ మానవ దర్శనమే. తరువాత సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్.. సబ్‌కా ప్రయాస్.. అంటూ తన ఆశయాన్ని విస్తరించారాయన.

## పాశ్చాత్య పోకడలకు దీనదయాళ్ సవాలు

### ఆచార్య బి. సారంగపాణి



రాజకీయ సిద్ధాంతాల విషయంలో దీనదయాళ్ పాశ్చాత్య పోకడలకు సవాలు విసిరారు. దేశంలో రెండు పంచవర్ష ప్రణాళికలు విఫలమైనాయని రూఢి అయిన తరువాత, చైనా యుద్ధంలో అపజయం తరువాత ఏకాత్మ మానవ దర్శనం సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. గణితం దీనదయాళ్ అభిమానాంశం. తరువాత సంస్కృతం అంటే అపారమైన గౌరవం ఉంది. ఆర్థికశాస్త్రం విశేషంగా అధ్యయనం చేశారు. అందుకే పాశ్చాత్య రాజకీయ సిద్ధాంతాలను సవాలు చేస్తూ ఏకాత్మ మానవ దర్శనాన్ని ప్రతిపాదించారు. ఏకాత్మ మానవ దర్శనంలో మరొక కీలక అంశం అంత్యోదయ. సమాజంలోని అట్టడుగు వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలితాలు అందాలంటుంది అంత్యోదయ.

# అంతర్జాతీయ స్కూల్‌లో బంగ్లాదేశ్ జెండా!

**మ**హారాష్ట్రలోని ఒక ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన జెండాల్లో బంగ్లాదేశ్ జెండా కూడా ఉండటం వివాదానికి దారితీసింది. పాల్ఘర్ జిల్లా నలసోపారాలోని ర్యాన్ ఇంటర్నేషనల్ స్కూల్ గోడపై పలు దేశాల జెండాలతో పాటు బంగ్లాదేశ్ జెండా కూడా ఉంది. ఆ దేశంలో హిందువులపై జరుగుతున్న హత్యలపై భారత్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ స్కూల్‌లో బంగ్లాదేశ్ జెండా ఏర్పాటు చేయడంపై బజరంగ్ దళ్ తీవ్రంగా





మండిపడింది. ఆ జెండాను తొలగించేందుకు పోలీసులతో కలిసి బజరంగ్ దళ్ సభ్యులు స్కూల్‌కు వెళ్లారు. స్కూల్ యాజమాన్యం తీరుపై బజరంగ్ దళ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'నలసోపారాలోని ర్యాన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బంగ్లాదేశ్ జెండా ఎగురవేశారు. ఇది భారతదేశ నీతి నియమాలకు విరుద్ధం. హిందువులు హింసకు గురవుతున్నప్పుడు, బంగ్లాదేశ్‌లో మన అక్కాచెల్లెళ్లు, కుమార్తెల భద్రత ప్రమాదంలో ఉన్నప్పుడు, ఇలాంటి చర్యలు భారతదేశ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తాయి' అని పేర్కొంది. 'భారత గడ్డపై కేవలం భారతదేశ త్రివర్ణ పతాకం మాత్రమే ఎగురుతుంది. దేశానికి వ్యతిరేకంగా వ్యవహరించే వారిపై బజరంగ్ దళ్ గట్టిగా స్పందిస్తుంది. ఈ భూమి భారత్ మాతకు చెందినది. ఇక్కడ కేవలం భారతదేశానికి మాత్రమే గౌరవం దక్కుతుంది' అని సోషల్ మీడియా పోస్ట్‌లో వార్నింగ్ ఇచ్చింది.


**చందాదారులుగా చేరండి! చేర్పించండి**


**హిందూ నగారా సంవత్సర చందా రూ. 100/-**


**మీతో పాటుగా మరి కొంతమందిని చందాదారులుగా చేర్పించండి.**

**UNION BANK OF INDIA**
**A/C No. 014511100004775**
**IFSC CODE: UBIN0801453**
**Governorpet Branch,**
**VIJAYAWADA**


**తేరా వైభవ్ సదా అమర్ రహే మా...**

## మల్లారెడ్డి.. జయపాల్‌రెడ్డి





**1960** దశకం వరకు వరంగల్ జిల్లాలోని కోయిల్వాయి గ్రామం జనసంఘ్‌కు బలమైన కేంద్రం. ఈ గ్రామం వరంగల్‌కు 18 కి.మీ. దూరంలో ఉంటుంది. ఆరెస్సెస్ సిద్ధాంతాన్ని వ్యాపింపజేయడానికి అఖిల భారత విద్యార్థి పరిషత్ కార్యకర్తలైన రాజిరెడ్డి, జయపాల్‌రెడ్డి చుట్టుపక్కల గ్రామాల్లో పర్యటించేవారు. 1982 జూలై 27న అర్ధరాత్రి వందమంది నక్సల్స్ గ్రామంలోకి వచ్చి రెండు గుంపులుగా విడిపోయారు. ప్రతి ఇంటికి బయటి వైపున తలుపులకు గడియ పెట్టారు. ఒక గుంపు మల్లాది రామిరెడ్డి ఇంటికి వెళ్ళి 10వ తరగతి చదువుతున్న అతడి కొడుకు మీద ఇనుపరాడ్లతో దాడి చేసింది. తర్వాత ఆ గుంపు గువ్వ మల్లారెడ్డి ఇంటి మీద దాడి చేశారు. ధైర్యవంతుడైన మల్లారెడ్డి లాఠీతో కాసేపు తనను తాను కాపాడుకున్నాడు. కానీ నక్సల్స్ మారణాయుధాలతో దాడిచేసి అతడిని చంపేశారు. మరో గుంపు శాఖా ముఖ్య శిక్షక్ రాజిరెడ్డి గుడిసె మీద పడింది. అయితే రాజిరెడ్డి తప్పించుకోవడంతో జయపాల్‌రెడ్డి ఇంటి మీద బాంబులు వేశారు. తీవ్ర గాయాలైన జయపాల్ రెడ్డి, అతని తమ్ముడు సమ్మిరెడ్డిని ఆస్పత్రికి తీసుకెళ్తుండగా దారిలో జయపాల్ రెడ్డి చనిపోయాడు. సమ్మిరెడ్డి బతికాడు. మల్లారెడ్డి, జయపాల్ రెడ్డి ఇద్దరూ పేద రైతులే. ఒక్కొక్కరూ రెండెకరాల పొలం మీద జీవనం సాగించేవారు. మల్లారెడ్డికి భార్య, కొడుకు, కూతురు ఉండగా, జయపాల్ రెడ్డికి భార్య, ఒక కూతురు ఉన్నారు.

## మెంతులతో సౌందర్యం.. ఆరోగ్యం

**మెం**తులతో గోరింటాకు కలిపి నూరి పట్టిస్తే కాలి పగుళ్లు, మంటలు తగ్గుతాయి. మిరియాల పొడి, వాము పొడి, మెంతి పొడులను సమానంగా తీసుకొని తమలపాకు రసం, అర స్పూను తేనె కలిపి నమిలి రసం మింగుతుంటే తరచూ వచ్చే తుమ్ములు తగ్గుతాయి. నీళ్ల బేదులు ఉన్నప్పుడు మెంతుల పొడి అర స్పూను పెరుగులో కలిపి సేవిస్తే అజీర్తి విరోచనాలు తగ్గుతాయి. అంతకంటే ఎక్కువ తీసుకొంటే మలబద్ధకం, గ్యాస్ సమస్యలు వస్తాయి.

# అమ్మ భాషే అమృతం


**మ**నిషి జీవితంలో మొదట నేర్చుకునేది మాతృభాష. తల్లి ఒడే బిడ్డకు తొలి బడి. తన తల్లిని ఎవరూ చెప్పకుండానే అమ్మా అని బిడ్డ ఏ విధంగా పిలుస్తాడో మాతృభాష కూడా అలాంటిదే. మాతృభాష సహజంగా అబ్బుతుంది. అప్రయత్నం గానే వస్తుంది. అమ్మ అంటే మాతృభాష. అందుకే అమ్మను కాపాడుకున్నట్లే మాతృభాషను కూడా కాపాడుకోవాలి. **ప్రతి ఒక్కరు తమ మాతృభూమిని, సంస్కృతిని, మాతృభాషను గౌరవించాలని అవి మనకు ఆనందాన్ని కలిగించేవని ఋగ్వేదం చెబుతోంది.** ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకుంటాం. ప్రస్తుత బంగ్లాదేశ్ ఒకప్పుడు తూర్పు పాకిస్థాన్‌గా, ఇప్పటి పాక్‌లో అంతర్భాగంగా ఉండేది.



1948లో ఉర్దూను జాతీయ భాషగా పాకిస్థాన్ ప్రకటించింది. ఉర్దూతో పాటు బెంగాలీని కూడా జాతీయ భాషగా ప్రకటించాలని బంగ్లాదేశ్‌లో డిమాండ్లు మొదలై ఉద్యమ రూపు దాల్చింది. ఈ ఉద్యమాన్ని అణచివేయడానికి చేసిన ప్రయత్నాల్లో 1952 ఫిబ్రవరి 21న ఎంతో మంది మరణించారు. మరెంతో మంది గాయపడ్డారు. **మాతృభాష కోసం మన పొరుగు దేశంలో జరిగిన ఈ త్యాగాలు ప్రపంచాన్ని ఆకర్షించాయి. ఫలితంగా బంగ్లా భాషా ఉద్యమం, మానవ భాష సాంస్కృతిక హక్కులను పురస్కరించుకొని యునెస్కో ప్రతి ఏటా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది.** ప్రతి ఏడాది అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవానికి ఓ ఇతివృత్తాన్ని యునెస్కో ప్రకటిస్తుంది. అమ్మపాల వంటి అమ్మభాషను చిన్నతనంలోనే విద్యార్థులకు నేర్పటం ద్వారా, అదే భాషలో విజ్ఞానాన్ని అందించడం ద్వారా వారి వృద్ధి వేగవంతం అవుతుందని సి.వి. రామన్ వంటి శాస్త్రవేత్తలు నొక్కి చెప్పారు. మన మాతృభాషలో ఉన్న విజ్ఞాన భాండాగారాన్ని మనం అర్థం చేసుకోవాలి. ఎందుకంటే భాష, సంస్కృతి ఎప్పుడూ ముడిపడి ఉంటాయి. అన్నమయ్య సంకీర్తనలు ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తూనే వ్యక్తిత్వ వికాసానికి బాటలు వేస్తాయి. **వాన వాన వల్లప్పా అంటూ వానను ఆహ్వానించే సంస్కృతి మనదైతే... రెయిన్ రెయిన్ గో అవే అంటూ వాన వద్దని చెప్పే సంస్కృతి ఆంగ్లానిది.** మన వ్యవసాయ దేశానికి వానలు కావాలి. అందుకే మన సంస్కృతి బతకాలి అంటే మన భాషను కాపాడుకుని, ముందు తరాలకు సగర్వంగా అందించాలి.

## పల్నాటి సీమలో ప్రభాత సూర్యుడు
# కన్నెగంటి హనుమంతు

**ప**ల్నాడుగా ప్రసిద్ధి చెందిన గురజాల, మాచర్ల, వినుకొండ, నరసరావుపేట ప్రాంతాలు బ్రిటిషర్ల కాలం నుంచే కరవు కాటకాలకు నిలయాలుగా ఉండేవి. వర్షాలు లేక రైతులు, రైతు కూలీలు అవస్థలు పడేవారు. దిగుబడులు వచ్చినా, రాకున్నా శిస్తులు చెల్లించాల్సి వచ్చేది. పశువుల పోషణకు ప్రజలంతా అడవులపై ఆధారపడేవారు. ఇందుకోసం ఏడాదికి రూ.2 పుల్లరి చెల్లించాల్సి వచ్చేది. అలాంటి సమయంలో దుర్గి మండలం కోలగట్ల శివారులోని మించాలపాడులో 1870లో కన్నెగంటి అచ్చమ్మ, వెంకటప్పయ్య దంపతులకు హనుమంతు జన్మించారు. గ్రామాధికారుల ఆగడాలను చూస్తూ పెరిగిన హనుమంతు... ప్రజల జీవన పరిస్థితులను మార్చడానికి ఆరాటపడేవారు. గాంధీజీ ఇచ్చిన సహాయ నిరాకరణ పిలుపును పల్నాడు అందిపుచ్చుకుంది. మించాలపాడు కేంద్రంగా హనుమంతు సారథ్యంలో పూర్తి అహింసా విధానంలో ప్రజలు చేస్తున్న ఉద్యమం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సహించలేని బ్రిటిష్ సైనికులు జంగమహేశ్వరపు రామాపురంలో పన్నులు చెల్లించడంలేదని 18మంది రైతులకు బేడీలు వేసి ఊరేగిస్తూ తీసుకెళ్లారు. జమీందారులు, అధికారులు ఎన్ని విధాలుగా ప్రయత్నించినా హనుమంతు లొంగకపోవడంతో 1922లో మద్రాసు నుంచి ప్రత్యేక కలెక్టర్‌గా రూథర్‌ఫర్డ్‌ను పంపించారు. ఆయన సారథ్యంలో బ్రిటిష్ సైనికులు గుర్రాలపై ఒక్కో గ్రామానికి చేరుకుంటూ విధ్వంసం సృష్టించినా, చివరకు హనుమంతును ప్రలోభాలకు గురి చేసేందుకు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. దీంతో



హనుమంతును హతమార్చడం ద్వారానే ఉద్యమాన్ని ఆపాలని రూథర్‌ఫర్డ్ పన్నాగం పన్నాడు. పుల్లరి చెల్లించకుంటే ఊరిలోని పశువులన్నిటినీ తోలుకెళతామని 1922 ఫిబ్రవరి 22న ఆంగ్లేయ పోలీసుల నుంచి కబురు అందింది. రైతులు అడ్డుకోగా వారిపై దాడి చేశారు. విషయం తెలిసి, ప్రజలందరి పన్నును తానే చెల్లిస్తానంటూ కేకలు వేస్తూ పరుగున వస్తున్న హనుమంతుపై పోలీసులు 26సార్లు కాల్పులు జరిపారు. దాంతో ఆయన కుప్పకూలారు. వందేమాతరం అంటూ నినదిస్తూ కన్నెగంటి హనుమంతు అదేరోజు రాత్రి కన్నుమూశారు.

# శ్రమ ఏవ జయతే..

**ఒ**లింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించిన చార్లీ పడాక్ ఒకసారి పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడాడు. ‘మీరు ఏదైనా సాధించగలమని నమ్మితే అది తప్పకుండా సాధ్యపడుతుంది. నమ్మకాన్ని మించింది లేదు’ అని చెప్పారు. ఈ మాటలతో ఉత్తేజితుడైన ఓ యువకుడు లేచి ‘సర్..! మీలాగే ఒలిపింక్ చాంపియన్ కావాలనేది నా ఆశ. అందుకోసం ఏం చేయడానికైనా సిద్ధమే’ అన్నాడు. చార్లీ ఆ యుకుడితో ప్రత్యేకంగా మాట్లాడాడు. నాటి నుంచి ఆ యువకుడి జీవితమే మారిపోయింది. తర్వాత కొన్ని సంవత్సరాలకే బెర్లిన్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో జెస్సీ ఓవెన్స్ అనే ఆ యువకుడు నాలుగు స్వర్ణ పతకాలు గెలిచాడు. అతడికి ఒక కాలు కాస్త వంకరగా ఉండేది. ఒలింపిక్స్ విజేతకు సొంత ఊరిలో అద్భుతమైన స్వాగత కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఊరేగింపుగా వెళ్తున్న ఓవెన్స్ వద్దకు మరో వికలాంగుడైన యువకుడు వచ్చాడు. నేను కూడా మీ మాదిరే ఒలింపిక్ చాంపియన్ కావాలని అనుకుంటున్నాను అని చెప్పాడు. అప్పుడు ఓవెన్స్ అతడితో ‘నీ వయసులో ఉన్నప్పుడు నేను కూడా ఇలాగే



అనుకున్నాను. ఎంతో శ్రమించాను. చాంపియన్ అయ్యాను. నీవు కూడా శిక్షణ పొందు. శ్రమించు. సంకల్పముంటే కచ్చితంగా ఒలింపిక్ చాంపియన్ అవుతావు. ఆల్ ది బెస్ట్!’ అన్నాడు. ఇది జరిగిన కొన్ని సంత్సరాల తర్వాత ఆ యువకుడు లండన్ ఒలిపిక్స్‌లో 100 మీటర్ల పరుగు విభాగంలో స్వర్ణం గెలిచాడు. అంతేకాదు ఒవెన్స్ సృష్టించిన ప్రపంచ రికార్డును కూడా బద్దలు కొట్టాడు. ఆ యువకుడి పేరు హ్యారిసన్. ఓవెన్స్‌కు చార్లి పడాక్.. హ్యారిసన్‌కు ఓవెన్స్ ఆదర్శమైనట్టే మనం కూడా ఏదో ఒక విషయంలో మనకన్నా చిన్నవారికి ఆదర్శంగా నిలవాలి.

# పచ్చని సీమలో.. ప్రభల తీర్థం

**క**నుమ పండుగ రోజు కోనసీమ జిల్లాలో ప్రభల తీర్థాలు ఘనంగా జరిగాయి. అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోట ప్రభల తీర్థం చూసేందుకు లక్షలాది మంది భక్తులు పోటెత్తారు. 11 గ్రామాల నుంచి వచ్చిన ఏకాదశ రుద్రులు, ఉప ప్రభలు జగ్గన్నతోటలో కొలువుతీరాయి. పచ్చని



చేలను తొక్కుకొంటూ గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారానికి చెందిన చెన్నమల్లేశ్వర స్వామి, వీరేశ్వర స్వామి ప్రభలను పంట కాలువ దాటిస్తున్న తీరు చూపరులను గగుర్పాటుకు గురిచేసింది. గంగలకుర్రు అగ్రహారం వీరేశ్వర స్వామి, గంగలకుర్రు చెన్నమల్లేశ్వర స్వామి, వ్యాఘ్రేశ్వరం వ్యాఘ్రేశ్వరస్వామి, కె.పెదపూడి మేనేకశ్వరస్వామి, ఇరుసుమండ ఆనంద రామేశ్వరస్వామి, వక్కలంక కాశీవిశ్వేశ్వరస్వామి, నేదునూరు చెన్నమల్లేశ్వరస్వామి, ముక్కామల రాఘవేశ్వరస్వామి, మొసలపల్లి మధుమానంత భోగేశ్వరస్వామి, పాలగుమ్మి చెన్నమల్లేశ్వరస్వామి, పుల్లేటికుర్రు అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి ప్రభలు జగన్నతోటకు తరలివచ్చాయి. వాకలగరువు, తొండవరం గ్రామాల నుంచి సుమారు 57 అడుగుల ప్రభలను వాకలగరువులో జరిగే తీర్థానికి తీసుకువచ్చారు.

# 5.51 కోట్ల రుద్రాక్షలతో శివలింగం

**ప్ర**యాగ్‌రాజ్‌లో మాఘ మేళా జరుగుతోంది. ప్రజలు పవిత్ర స్నానాలు చేస్తున్నారు. మహాదేవుడి దీవెనలతో పవిత్ర ప్రయాగ్‌రాజ్‌లో రుద్రాక్షలతో జ్యోతిర్లింగాన్ని ఏర్పాటు చేసినట్లు అభయ్ చైతన్య మౌని మహారాజ్ తెలిపారు. సుమారు 11 అడుగుల ఎత్తు, 9 అడుగుల వెడల్పుతో ఉన్న ఈ శివలింగం ఏర్పాటు కోసం సుమారు 5.51 కోట్ల రుద్రాక్షలను వాడారు. 5.51 కోట్ల సార్లు పంచాక్షరీ మంత్రాన్ని పఠించారు. ఆ జ్యోతిర్లింగ ఏర్పాటు ప్రాంతంలో సుమారు 11 వేల త్రిశూలాలను కూడా ఏర్పాటు చేశారు. జాతీయ భద్రత కోసం ప్రత్యేక పూజను నిర్వహిస్తున్నట్లు మౌనీ మహారాజ్ చెప్పారు.



# ఇలా అన్నారు...



నేను ఒక ముస్లిం మహిళను. ఉపవాసాలు పాటిస్తాను. భక్తితో ప్రార్థనలు చేస్తాను. అయినా కూడా నేను ఈ భారతదేశపు గర్వించదగిన కుమార్తెను. మతం నా వ్యక్తిగతం. కానీ ఈ దేశం నాకు ఒక ఇల్లు లాంటిది. నాకు నిజంగా ఏదైనా సమస్య వచ్చినప్పుడు సాయం చేయడానికి ముందుకొచ్చేది.. నా హిందూ సోదరుడే. అతను అండగా నిలబడి నన్ను కాపాడతాడని నాకు కచ్చితంగా తెలుసు. ఇదే నా భారత దేశపు నిజమైన స్ఫూర్తి.

**– న్యూస్ యాంకర్ రూబికా లియాఖత్**



గురుకులం అనేది కేవలం విద్యను అందించే సంస్థ మాత్రమే కాదు. అది ఒక సంపూర్ణ జీవన విధానాన్ని బోధిస్తుంది. క్రమశిక్షణ, వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుంది. బాలికల విద్యకు అంకితమైన గురుకులం సామాజిక మార్పునకు శక్తిమంతమైన కేంద్రంగా నిలుస్తుంది. బాలికల విద్య అనేది ఒక అవకాశం కాదు. అది దేశ భవిష్యత్తును నిర్మించే మౌలిక అవసరమని బలంగా గుర్తించాలి.

**– ఒడిశా గవర్నర్ కంభంపాటి హరిబాబు**



కులం, మతం, వర్గం ఆధారంగా జరిగే విభజనలు సంపూర్ణ వినాశనానికి కారణమవుతాయి. లౌకికవాదం పేరుతో దుకాణాలు నడుపుతున్న వ్యక్తులు హిందూ సమాజాన్ని, సనాతన ధర్మాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తున్నారు. అయితే బంగ్లాదేశ్ సంఘటనల విషయానికి వస్తే వారి నోళ్లు ఫెవికాల్, టేప్‌తో మూతపడినట్లు ప్రవర్తిస్తున్నారు. విభజనవాదులు మనల్ని బలహీనపరచడానికి అనుమతించొద్దు. అందరూ ఇదే సంకల్పంతో ముందుకు సాగితే, భవిష్యత్తు సనాతన ధర్మానిదే. ప్రపంచ వ్యాప్తంగా సనాతన జెండా రెపరెపలాడుతుంది.

**– ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్**



హిందువులంతా ఏకం కావాలి. మన సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకుంటూ వాటి ఔన్నత్యాన్ని నేటి తరానికి తెలియజేయాలి. హిందూ మతం నుంచి మతమార్పిడులు జరగకుండా చూసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. దేశంలో కోటి మంది హిందువులు ఏకమైతే అన్యమతస్తులు హిందూ మతం జోలికి రావడానికి భయపడతారు.

**– శ్రీ కమలానంద భారతీ స్వామి**

# శిల్ప కళా వైభవానికి నిలయం..

**అ**వనిగడ్డలోని శ్రీలక్ష్మీ నారాయణ స్వామివారి ఆలయం పురాతన శిల్పకళా వైభవానికి నిలయం. ఒకప్పుడు ఈ దేవాలయం కృష్ణా నదీ గర్భంలో ఉండేది. వరదల వల్ల ఆలయం దెబ్బతినడంతో అక్కడినుంచి ప్రస్తుతం ఉన్నచోటుకు తరలించి పునర్నిర్మించారు. ఆలయ ముఖమండపంలోని 32 స్తంభాలపైనా రామాయణం, భాగవతం చిత్ర రూపంలో ఉన్నాయి. ఇక్కడి లక్ష్మీనారాయణ స్వామిని శ్రీరామచంద్ర మూర్తి స్వయంగా ప్రతిష్ఠించారని పురాణోక్తి. అవనిగడ్డలో ఇప్పుడు కనిపిస్తున్న ఆలయ గోపురాలను 2వ కులోత్తుంగ చోడగొంక చోడదేవుడు చూడ నారాయణ దేవర ప్రతిష్ఠించినట్లు శాసనాలు వివరిస్తున్నాయి. ఈ ఆలయ మండపాన్ని రథం ఆకృతిలో నిర్మించారు. సోపానాలకు రెండువైపులా గుర్రాలు, ఏనుగులు, సింహాల ప్రతిమల వరుసలు ఉన్నాయి. గుర్రాల కళ్లేలకు సంబంధించిన రాతి పగ్గాలు మండప స్తంభాలకున్న కొక్కేలకు తగిలించి ఉండేవి. ఇప్పుడు రాతి పగ్గాలు లేవు కానీ కొక్కెం చూడవచ్చు. గర్భాలయంలో లక్ష్మీనారాయణ స్వామి విగ్రహం అతిమనోహరంగా ఉంటుంది. ఎడమతొడపై అమ్మవారు కూర్చుని ఉండగా పద్మం, గదతో ఊర్ధ్వ హస్తాలతో, శంఖ సహిత అభయ దక్షిణ హస్తంతో, అమ్మవారి నడుము చుట్టూ ఉన్న హస్తంలో శాంత చక్రంతో స్వామి దర్శనమిస్తారు. ఈ శిల్ప లక్షణం మనకు ఏ గ్రంథంలోనూ దొరకదు. రేపల్లె తాలూకా నల్లూరులో లక్ష్మీ నారాయణ స్వామి ఆలయం ఉంది. ఈ రెండింటినీ కలిపి ఉభయ నారాయణ క్షేత్రంగా పిలుస్తారు.





# ఆరోగ్య ప్రదాయిని.. నువ్వులు



**ఆ**హార పదార్థాలు, వివిధ వంటకాల తయారీలో నూగులు (నువ్వులు) ప్రధాన పాత్ర పోషిస్తాయి. నువ్వుల పొడి, చట్నీ, చిక్కి తదితరాల్లో వీటిని వాడతారు. నువ్వులను సంస్కృతంలో తిలలు అంటారు. దీని శాస్త్రీయ నామం 'సేసామం ఇండికం'. నువ్వులు నలుపు, తెలుపు, గోధుమ రంగుల్లో ఉండి అపారమైన పోషక విలువలు కలిగి ఉంటాయి. ఔషధపరంగా, పితృ కార్యాల్లో నల్ల నువ్వులు వాడతారు. వీటిని బెల్లం కలిపి దంచి రోజూ రాత్రి పడుకొనే ముందు నిమ్మకాయంత పరిమాణంలో సేవించాలి. మర్నాడు ఉదయం ఒక లీటరు నీళ్ళు తాగితే మలబద్ధకం తగ్గుతుంది. దీనిని స్త్రీలు బహిష్టుకు ముందు 4 రోజుల నుంచి తర్వాత 4 రోజుల వరకు ఉసిరికాయంత పరిమాణంలో రెండు పూటలా తీసుకుంటే బహిష్టు నొప్పి తగ్గి ఋతుస్రావం సరిగ్గా జరుగుతుంది. వాము, నువ్వులు, మెంతులు సమానంగా కలిపి పొడిచేయాలి. 2 గ్లాసుల నీటిలో 2 చెంచాల పొడి వేసి అర గ్లాసు మిగిలే వరకూ మరిగించి, వడగట్టి రోజూ రెండుసార్లు తాగితే మాసిక ధర్మము క్రమబద్ధం అవుతుంది. నువ్వుల చూర్ణం, శొంఠి పొడి సమ భాగంలో కలిపి అర చెంచా పరిమాణంలో రెండు పూటలా తేనెతో సేవిస్తే కీళ్ల నొప్పులు తగ్గుతాయి. నువ్వులను గర్భిణులు వాడకూడదు. ఆవకాయ పచ్చడి ఎక్కువ కాలం నిల్వ ఉండేందుకు నువ్వుల నూనె వాడతారు. నువ్వుల నూనెలో అర స్పూను వాము చూర్ణం కలిపి నానబెట్టి కొద్దిగా సేవిస్తే అరికాళ్ళలో చేతుల్లో చెమట పట్టడం తగ్గుతుంది. నువ్వులు, కలకండ కలిపి నమిలి, తేనె, టంకన భస్మ చిటికెడు కలిపి పూతగా పూస్తే నోటిపూత తగ్గుతుంది. నువ్వులు అందరూ సేవించదగిన ఆరోగ్య ప్రదాయిని.

**ఈ నెల శ్లోకము**



**లాలయేత్ పంచవర్షాణి, దశ వర్షాణి తాడయేత్ ।**
**ప్రాప్తేతు షోడశే వర్షే, పుత్రం మిత్రవదాచరేత్ ॥**

**భావము:** కుమారుడికి ఐదేళ్ల వయసు వచ్చేవరకూ లాలించాలి. ముద్దుచేయాలి. ఆ తర్వాత పదేళ్ల పాటు క్రమశిక్షణతో పెంచాలి. అవసరమైతే మందలించాలి, దండించాలి. కానీ పదహారేళ్ల తర్వాత అతడిని ఒక స్నేహితుడిలా చూడాలి.

# కలుపుతీత మరింత సులభంగా..!

## మల్టీపర్పస్ వీడ్ వెహికల్‌తో అన్నదాతకు ఉపయోగం

**స**న్నకారు రైతులకు పొలంలో కలుపు సమస్య ఎక్కువ. మరోవైపు కూలీల కొరత కూడా వేధిస్తుంది. ఎకరానికి కలుపు తీసేందుకు దాదాపు రూ.30 వేల వరకూ ఖర్చు పెట్టాల్సి వస్తుంది. చాలామంది చిన్న రైతులు కలుపు తీయలేక అలాగే వదిలేస్తుంటారు. ఈ సమస్య పరిష్కారానికి విద్యార్థులు ఒక అద్భుతమైన యంత్రాన్ని రూపొందించారు. ఒకేసారి రెండు పనులు చేసేలా మల్టీ పర్పస్ వీడ్ రిమూవల్ వెహికల్‌ను సృష్టించి ప్రశంసలు అందుకున్నారు.

**తయారీ విధానం..:** ఒకేసారి కలుపు తొలగించడంతో పాటు అంతర్ కృషి చేసేలా మల్టీపర్పస్ వీడ్ రిమూవల్ వెహికల్ తయారు చేశారు. ఇందుకోసం పవర్ మోటర్ సోలార్ ప్యానల్ రెండు బ్యాటరీలు రెండు చక్రాలు కల్గిన చిన్నపాటి యంత్రాన్ని తయారు చేసి దానికి కలుపు మరియు భూమిని అంతర్ కృషి చేసే మడకలను అనుసంధానం చేశారు. ఒక మోటారుకు కలుపును కత్తిరించే బ్లేడ్స్ ఏర్పాటు చేశారు. సోలార్ ఎనర్జీ బ్యాటరీ లోకి చేరి అక్కడ నుంచి మోటారు విద్యుత్తు వెళ్తుంది. యంత్రానికి ముందు భాగంలో పెద్దగా ఉన్న కలుపు మొక్కలు కత్తిరించడం



తోపాటు వెనుక మడకలతో భూమిని చదును చేస్తుంది. చిన్న రైతులు ముఖ్యంగా కూరగాయల పంటలు వేసేవారు, ఇంటి పంటలు పండించుకునే వారికి ఇది బాగా ఉపయోగపడుతుంది. ఈ యంత్రంతో రోజూ ఎకరానికి పైగా కలుపు తీసుకోవచ్చు. యంత్రం తయారీకి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చవుతుంది. ఒకే సమయంలో కలుపు తీయడంతో పాటు భూమి చదును చేయడం వల్ల చాలా వరకు ఖర్చు తగ్గుతుంది. రైతులకు ఈ నమూనా ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇంకో మోటార్ కూడా అమర్చితే యంత్రాన్ని యాక్సిలేటర్ ద్వారా నడపవచ్చు. మరో రూ.10వేల ఖర్చుతో పూర్తి యంత్రం తయారవుతుంది. మోటార్ కెపాసిటీని బట్టి దీని ధర మారుతుంది. మరిన్ని వివరాలకు శ్రీ ఆంజనేయ అగ్రి రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ ముప్పా లక్ష్మణరావు గారిని (9849140465) సంప్రదించవచ్చు.

## కుంగుబాటుకు విరుగుడు.. సేతుబంధాసనం

**సే**తు బంధం అంటే వంతెన నిర్మాణం. ఈ ఆసనంలో శరీరం వంతెన మాదిరిగా కనిపిస్తుంది కాబట్టి దీనికి సేతు బంధాసనం అని పేరు. ఇది కుంగుబాటును ఆందోళనను తగ్గిస్తుంది. వీపు కండరాలను బలోపేతం చేస్తుంది.

**చేసే విధానం:** వెల్లికిలా పడుకొని కాళ్లను తిన్నగా చాపాలి. మోకాళ్లను వంచుతూ, మడమలను పిరుదులకు దగ్గరగా తీసుకు రావాలి. చేతులతో మడమలను గట్టిగా పట్టుకోవాలి. శ్వాస తీసుకుంటూ పాదాలు, భుజాలు, తలతో నేలను నొక్కుతూ పిరుదులు, తొడలు నడుము, పొట్ట, ఛాతీని పైకి ఎత్తాలి. మామూలుగా శ్వాస తీసుకుంటూ కాసేపు అలాగే ఉండాలి. శ్వాసను వదులుతూ నెమ్మదిగా యథాస్థితికి రావాలి.




**ఇవీ ప్రయోజనాలు:** కాళ్లు, చేతుల్లోని కండరాలు బలపడతాయి. రక్తప్రసరణ మెరుగుపడుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. తలనొప్పి, ఆందోళన, డిప్రెషన్‌ను తగ్గిస్తుంది. కడుపులోని అవయవాలను సాగదీస్తుంది. జీర్ణశక్తిని ఉత్తేజితం చేస్తుంది. మలబద్ధకాన్ని నివారిస్తుంది.

**ఎవరు చేయకూడదు:** హెర్నియా, అల్సర్లు, మెడ నొప్పి వంటి సమస్యలు ఉన్నవారు ఈ ఆసనం వేయకూడదు.

## తొక్కుడు బిళ్ల

**ఇ**ది ఆడపిల్లలు ఎక్కువగా ఆడే ఆట. ఈ ఆటను ఒంటరిగా లేదా జట్టుగా ఆడవచ్చు. సాధారణంగా ఈ ఆటను పిల్లలు ఆటస్థలాల్లో, ఆరుబయట, విశాలమైన ప్రాంగణాల్లోనూ ఆడుతుంటారు. భారత దేశంలో ఈ ఆటను గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా, ముఖ్యంగా మన తెలుగు రాష్ట్రాలలో ఈ ఆటను బాగా ఆడతారు. విదేశాల్లో కూడా కొద్దిగా మార్పులతో ఆడుతారు. ఈ ఆటను ఇద్దరు ఆడవచ్చు. ముందుగా పక్కపక్కనే ఉండే నాలుగు నిలువు, రెండు అడ్డంగా దీర్ఘ చతురస్రాకార గడులను గీయాలి. ఆ గడుల బయట ఆడేవారు నిలుచోవాలి. ముందుగా ఒకరు తన చేతిలోని బిళ్ళను మొదటి గడిలో వేసి ఒక కాలు మడిచి మిగతా ఎనిమిది గడులను దాటించి బయటకు తీసుకురావాలి. తరువాత రెండో గడి, ఈ విధంగా మిగిలిన అన్ని గడులను దాటించాలి. ఏ సమయంలో కూడా కాలు గానీ, బిళ్ళ గానీ గడుల గీతలను తాకకూడదు. గడులన్నీ అయిపోయాక కాలి వేళ్ళ మధ్య బిళ్ళను బిగించి పట్టుకుని దాన్ని కుంటి కాలితో ఎనిమిది గడులను గెంతి రావాలి. అలాగే కాలి మడమ మీద బిళ్లను పెట్టి గడులను దాటాలి. తరువాత తలపై పెట్టుకొని దాటాలి. తరువాత అరచేతిలో, ఆపై మోచేయిపైనా, భుజంపైనా పెట్టుకొని అన్ని గడులను దాటాలి. తరువాత బిళ్ళను గడుల అవతల వేసి కళ్ళు మూసుకొని ఇదే ఆటను మరోసారి ఆడాలి. ఇవన్నీ పూర్తి చేసినవారు గెలిచినట్టు ప్రకటించాలి.




## ప్రాచీన యుద్ధ కళ.. తోడా

**హి**మాచల్‌ప్రదేశ్‌లో తోడా చాలా ప్రాచుర్యంలో ఉన్న యుద్ధ కళ. దీనిలో ప్రధానంగా కర్రతో చేసిన విల్లులు, బాణాలు వాడతారు. బాణానికి ముందుభాగంలో అమర్చే గుండ్రటి కర్రతో చేసిన ఆకారం ఆధారంగా దీనికి తోడా అనే పేరు వచ్చింది. దీన్ని యుద్ధ విద్య, నృత్యం, సంగీతాల సమాహారంగా చెప్పవచ్చు. బైశాఖీ ఉత్సవాల్లో కచ్చితంగా తోడా విద్యను ప్రదర్శిస్తారు. ఇక్కడి ప్రజలు, క్రీడాకారుల విలువిద్య పాటవాన్ని తెలియజెప్పడమే ఈ కళ ప్రత్యేకత. ఈ ఆటలో రెండు బృందాల్లో 500 మంది చొప్పున క్రీడాకారులు ఉంటారు. అయితే వారంతా విలువిద్యలో నిపుణులు కాదు. విలుకాళ్లను ఉత్సాహపరిచేవారు కూడా ఉంటారు. ఈ రెండు జట్లను పాషిస్, సాతిన్ పేర్లతో పిలుస్తారు. వీరు



నృత్యరూపంలో విల్లంబులతో పోరాడుతారు. మహాభారతంలో పాండవులు, కౌరవులకు వీరు ప్రతిరూపాలని స్థానికులు విశ్వసిస్తారు. తోడా ఇండియన్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (టిఐఎస్ఎఫ్) వంటి సంస్థలు ఈ క్రీడను ప్రోత్సహిస్తున్నాయి.

# రామయ్యకు కోపం ఎందుకొచ్చిందో..!

రంగనాథ రామాయణంలో బుద్ధారెడ్డి రాముడి గుణాలను వివరిస్తూ "మానని రోషంబు మదిలేని వాని" అని అంటారు. రోషం ఉండటం మానవ సహజం. కానీ దీర్ఘకాల క్రోధం అశాంతికి కారణం అవుతుంది. రాముడికి కోపం వచ్చిన ఘట్టాలు రామాయణంలో అక్కడక్కడా కనిపిస్తాయి. కానీ ఆ కోసం ఎక్కువ కాలం లేదు.



శివధనుర్భంగం తర్వాత వచ్చిన పరశురాముడు తనను పరాక్రమం లేనివాడిగా, క్షత్రియ ధర్మాన్ని పాటించే సామర్థ్యం లేనివాడిగా భావించి, అవమానకరంగా మాట్లాడినందుకు రాముడికి కొన్ని క్షణాలు కోపం వచ్చింది. అయినా నిగ్రహించుకున్నాడు. పరశురాముడు బ్రాహ్మణుడు, తన గురువైన విశ్వామిత్రునికి బంధువు కావడం వల్ల తన కోపాన్ని కాకుండా పరాక్రమాన్ని మాత్రం ప్రదర్శించాడు. రాముడు ధనస్సు ఎక్కుపెట్టగానే అతడిలోని విష్ణు అంశను గుర్తించి తన అవతార పరమార్థం పూర్తయిందని గ్రహిస్తాడు. అలాగే వనవాసానికి వెళ్లిన కొత్తలో కైకను గురించి, భరతుడి గురించి లక్ష్మణుడితో రాముడు కాస్త నిష్ఠూరంగానే మాట్లాడతాడు. ఆ సమయానికి మానవ సహజంగా కోసం వచ్చింది. కానీ వెంటనే నిగ్రహించుకొని వారిని అర్థం చేసుకున్నాడు. అందుకే వారిపట్ల ద్వేషాన్ని పెంచుకోలేదు. మొదటి నుంచీ తనకు తల్లులు అందరూ సమానమేనని. కైకేయి తనను, భరతుడిని భేదభావంతో చూసేది కాదని గుర్తుచేసుకుంటాడు. కైక తనను అడవికి పంపడానికి, కఠినంగా మాట్లాడటానికి దైవం తప్ప వేరే కారణం లేదంటాడు. అంతేకానీ తన కష్టాలు అన్నింటికీ ఆమే కారణమని తాను బాధ పడుతూ అదేపనిగా ఆమెను నింద చేయలేదు.

**హిందూ నగారా**


**పాఠకులకు విజ్ఞప్తి**

హిందూ నగారాలో ప్రచురించబడుతున్న వార్తలు, వ్యాసాలపై మీ అభిప్రాయాలను ఈ క్రింది ఫోన్ నెంబరుకు వాట్సప్ ద్వారా కానీ, ఫోన్ చేసి కానీ తెలుపవచ్చు. అలాగే మీ మీ ప్రాంతాలలో జరిగే హిందుత్వ ప్రాధాన్యత కలిగిన సంఘటనలను కూడా మాకు తెలియపరచవచ్చు.

మీరు ఫోన్ / వాట్సప్ చెయ్యవలసిన నెంబర్ : 8333812685

# అనాథ బాలికలకు ఆలంబనగా..!

**రమ్య:** వదినా.. మీ అన్నయ్య ఈ మధ్య సంఘ శతాబ్ది అని హడావుడి పడుతున్నాడు. కాసేపు సంచలన్ అంటాడు.. కాసేపు వర్గలు అంటాడు. అన్నీ మగవాళ్ళకేనా? మహిళలకు ఏమీ లేవా?



**ఉజ్వల:** అదేంటి వదినా.. అలా అనేశావు. ప్రపంచంలో అతిపెద్ద మహిళా సంస్థ రాష్ట్ర సేవికా సమితి ఉంది కదా. అది స్థాపించి 90 సంవత్సరాలు కావస్తోంది.

**రమ్య:** అవునా! అందులో ఏ కార్యక్రమాలు చేస్తారో చెప్పవా..

**ఉజ్వల:** మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంచి, ఆత్మ సురక్ష నేర్పిస్తూ కుటుంబం, సమాజం, దేశం, ధర్మం, సంస్కృతి గురించి ఆలోచించేలా చేస్తుంది. ఇంకా ఆడపిల్లల కోసం హాస్టళ్లు ఉద్యోగ మందిర్‌లు, స్కూళ్ల, గ్రామాలను దత్తత తీసుకొని సేవా కార్యక్రమాలు ఎన్నో నిర్వహిస్తుంది. జమ్మూ కశ్మీర్‌లో తీవ్రవాదుల కాల్పుల్లో చాలామంది సామాన్యులు కూడా ప్రాణాలు కోల్పోయేవారు. అలా మరణించిన వారి పిల్లల కోసం రాష్ట్ర సేవికా సమితి ఆవాసం ఏర్పాటు చేసింది.

**రమ్య:** వాళ్లకి మాత్రమేనా? ఇంకా వేరే వాళ్ళు కూడా అందులో ఉంటారా? వాళ్ళ చదువులేనా? తరువాత కూడా చూస్తారా?

**ఉజ్వల:** తల్లిదండ్రులు లేని పిల్లలు ఎవరైనా అందులో పెరుగుతారు. వారికి విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు వాళ్ల పెళ్లిళ్ళు కూడా దగ్గరుండి చేస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే అది బాలికలకు పుట్టినిల్లు లాంటిది. మన తెలుగింటి ఆడపడుచు ప్రచారిక మాననీయ పంకజవల్లి గారు దాదాపు 28 ఏళ్ల నుంచి దానిని పర్యవేక్షిస్తున్నారు.

**రమ్య:** ఇలాంటి ఆవాసాలు ఇంకా ఎక్కడెక్కడ ఉన్నాయి?

**ఉజ్వల:** ప్రత్యేకంగా అమ్మాయిల కోసం దాదాపు ప్రతీ రాష్ట్రంలో ఇలాంటి ఆవాసం లేదంటే హాస్టల్ ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాల్లో ఒకప్పుడు పిల్లలు చదువుల కోసం బాగా ఇబ్బంది పడేవారు. వారికోసం కూడా ప్రత్యేక ఆవాసాలు ఏర్పాటు చేశారు.

**రమ్య:** మరి మన తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి ఏమిటి?

**ఉజ్వల:** భాగ్యనగర్‌లోని మల్కాజ్‌గిరిలో ఒకటి, జగిత్యాలలో మరొక ఆవాసం ఉన్నాయి. ఇక్కడ తల్లిదండ్రులు లేనివారే కాకుండా, చదువుకోవడానికి ఆర్థికంగా ఇబ్బంది పడే అమ్మాయిలకి కూడా వ్యవస్థ ఉన్నది.

**రమ్య:** నిజంగానే అమ్మాయిల కోసం, వాళ్ల అభివృద్ధి కోసం ఆలోచించే ఒక సంస్థ ఉండటం, అందులో సేవికా సమితి కావడం ఒక అదృష్టం వదినా. అందులో సేవికలుగా ఉండటం మనం సుకృతం.

## పదకేళి 16

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | | | | | 4 |
| | | | | | | 5 | |
| 6 | | 7 | | 8 | 9 | | |
| 10 | 11 | | | 12 | | | 13 |
| 14 | | | 15 | | | 16 | |
| 17 | | 18 | | | 19 | | |
| | | 20 | | 21 | | 22 | 23 |
| 24 | | | | 25 | | | |

### ఆధారాలు

**అడ్డం**

1. శివ శివా అంటూ చలి పారిపోయే రాత్రి (6)
5. విధము (2)
8. మోసగాడు (3)
10. రచయిత రాసినది (3)
12. చెట్టు (2)
14. శిరస్సు (2)
15. తినడానికి కూర్చునేది (2)
16. తిరగబడిన మహావృక్షం (2)
17. అడవి బాపిరాజు నవల (3)
19. భరతుడి తల్లి (2)
20. పంటినొప్పికి వాడే దినుసు (3)
22. గుంజ వెనుతిరిగింది (2)
24. లాక్షారసము (3)
25. భార్యాభర్తల మధ్య ఉండాల్సింది సరిగ్గా లేదు (2)

**నిలువు**

2. మెడలో వేసుకునేది (2)
3. వేగము (2)
4. తెలివి (2)
5. శత్రువు (2)
6. సరోజినీ నాయుడు బిరుదు (6)
7. అడవి (2)
8. మదనపల్లెలో ప్రధానపంట (3)
9. విశ్వాసపాత్రమైన శ్వానం తిరగబడితే... (2)
11. కదలిక (3)
13. ఓ ప్రముఖ రైల్వే స్టేషన్ (2)
16. తెనాలి రామకృష్ణుడు --- కవి (3)
18. చేద లాగడానికి బావికి దీన్ని బిగిస్తారు (3)
21. చందనము (2)
23. రాజు భార్య (2)

## పదకేళి 15 జవాబులు


| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 మ | 2 క | ర | 3 సం | క్ర | 4 మ | ణం | |
| | ను | | త | | లై | | 5 ధ |
| 6 గో | మ | 7 తి | | 8 వ | | 9 మ | ను |
| దా | | 10 ప | ట్టు | ద | ల | | ర్మా |
| 11 దే | వ | త | | నం | | 12 గ్రా | నం |
| 13 వి | ఠి | | 14 ఆ | | 15 ట | మం | |
| | | 16 పా | ట | 17 వ | ము | | 18 చె |
| 19 వ | ద | రు | | నం | | 20 ని | ప్పు |

## 100 సంవత్సరాల సంఘయాత్ర

# నూతన దిగంతాలు

ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో ప్రతిష్ఠిత వ్యక్తులు, వివిధ రంగాల ప్రముఖులతో రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ గత ఆగస్టులో సంవాదం నిర్వహించింది. మూడు రోజులపాటు సాగిన ఈ కార్యక్రమంలో తొలి రెండు రోజుల్లో సర్‌సంఘచాలక్ డాక్టర్ మోహన్‌జీ భాగవత్ ఆరేళ్ల క్రితం నిర్వహించిన 'భవిష్యద్భారతం' కొనసాగింపుగా కొన్ని అంశాలను ప్రస్తావించారు. మూడో రోజున ప్రశ్నోత్తరాలు జరిగాయి. సంఘం నూరు సంవత్సరాలు పూర్తి

### పుస్తక పరిచయం




**పుస్తకం పేరు:** 100 సంవత్సరాల సంఘయాత్ర – నూతన దిగంతాలు
**అనువాదం:** వి.వి. సుబ్రహ్మణ్యం
**ప్రచురణ:** సాహిత్యనికేతన్, విజయవాడ
**పేజీలు:** 106 **వెల:** రూ.80
**ప్రతులకు:** సాహిత్యనికేతన్, ఏలూరు రోడ్డు, రామమందిరం వీధి, గవర్నర్ పేట, విజయవాడ. 520 002.
**సెల్ నం:** 8333812687

చేసుకున్న సందర్భంగా, భారతదేశపు ఆత్మతో జరిగిన సంవాదం అది. అందులో ఆలోచనలు, ఆవేదనలున్నాయి. ప్రశ్నలు, సందేహాలతోపాటు సమాధానాలూ ఉన్నాయి. మొదటి రెండు రోజుల ఉపన్యాసాలు, మూడోరోజు నాటి ప్రశ్నోత్తరాలను శ్రీ వి.వి. సుబ్రహ్మణ్యం గారు తెలుగులోకి అనువదించారు. ఎటువంటి దాపరికం లేకుండా, అన్ని విషయాలనూ తేటతెల్లం చేసే ఈ భావసంపదను తెలుగువారికి అందించారు. ఈ సంవాదంలో అనేక సందేహాలు, ప్రశ్నలకు డాక్టర్ మోహన్‌రావ్ భాగవత్ సూటిగా ఇచ్చిన సమాధానాలు మనం తెలుసుకొని, పదిమందితో పంచుకోదగినవి.

### ఈ నెల పద్యము



॥ కొఱగాని కొడుకుపుట్టిన
కొఱగామియె కాదు తండ్రి గుణములు చెరచున్
చెఱకు తుద వెన్ను పుట్టిన
చెఱకున తీపెల్ల చెరచు సిద్ధము సుమతీ! ॥

**భావము:** అప్రయోజకుడైన కుమారుడు పుడితే.. అతను బాగుపడకపోగా తండ్రికి ఉన్న మంచి పేరును కూడా చెడగొడతాడు. చెరకు గడ చివరన కంకి మొలిస్తే అది వచ్చిన చోట తీపి ఉండదు. సరికదా.. ఆ గడలో ఉన్న తీపినంతటినీ కూడా ఈ కంకి పోగొడుతుంది.



# వికసించిన తెలుగు పద్మాలు




తెలుగు పద్మాలు వికసించాయి. కేంద్ర ప్రభుత్వం ఏటా ప్రకటించే పద్మ పురస్కారాలకు ఈసారి ఏపీకి చెందిన ఐదుగురు ఎంపికయ్యారు. వీరిలో ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందినవారే ముగ్గురు ఉండటం విశేషం. ప్రముఖ క్యాన్సర్ వైద్యుడు నోరి దత్తాత్రేయుడిని పద్మభూషణ్ వరించింది. మిగిలిన నలుగురూ పద్మశ్రీకి ఎంపికయ్యారు. అవార్డు గ్రహీతల వివరాలివీ...

## మంటాడ నుంచి మ్యాన్‌హ్యాటన్ వరకూ..



కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం మంటాడ గ్రామంలో నోరి దత్తాత్రేయుడు జన్మించారు. గత ఐదు దశాబ్దాలుగా ప్రముఖ ఆంకాలజిస్ట్‌గా విశిష్ట సేవలు అందిస్తున్నారు. అమెరికాలోని టాప్ 5 క్యాన్సర్ వైద్య నిపుణులలో ఆయన ఒకరు. తొమ్మిది రకాల క్యాన్సర్లకు చికిత్సలు అందిస్తున్న వైద్యుడిగా ప్రసిద్ధి పొందారు. ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న ఆయన అప్పుడప్పుడు మంటాడ వస్తుంటారు. వైద్యరంగంలో యాభై ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన 'మంటాడ టూ మ్యాన్‌హ్యాటన్ ' అనే పుస్తకాన్ని రచించారు. ఈ పుస్తకాన్ని గతేడాది మార్చిలో విజయవాడలో సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. 2015లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. అమెరికన్ క్యాన్సర్ సొసైటీ ఆయనకు 'ట్రిబ్యూట్ ఆఫ్ లైఫ్' అవార్డును ప్రదానం చేసింది. ఈ ఏడాది లోక్ నాయక్ పురస్కారానికి కూడా ఆయన ఎంపికయ్యారు.

## అభినవ అన్నమయ్య గరిమెళ్ల



సంగీతానికే అంకితమై పుంభావ సరస్వతిగా పేరు తెచ్చుకున్న గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ 1948 నవంబరు 9న రాజమహేంద్రవరంలో జన్మించారు. 600కు పైగా అన్నమయ్య కీర్తనలను స్వరపరిచి వెలుగులోకి తెచ్చిన ప్రసిద్ధ గాయకుడు ఆయన. టీటీడీ ఆస్థాన విద్వాంసుడిగా పనిచేస్తూ భక్తి సంగీతానికి సేవలందించారు. శాస్త్రీయ సంగీతాన్ని సామాన్యులకు చేరువ చేయడంలో అపూర్వ కృషి చేశారు. 1976లో టీటీడీ అన్నమయ్య ప్రాజెక్టులో గాయకుడిగా చేరి, 2006లో రిటైరయ్యారు. అన్నమయ్య కీర్తనలు స్వరపరచడం, ఆలపించడం, రికార్డు చేయడం, పుస్తక ప్రచురణకు జీవితాన్ని అంకితం చేశారు. తెలుగునాట సంకీర్తనా యజ్ఞ ప్రక్రియను ప్రవేశపెట్టిన ఘనత గరిమెళ్లకే దక్కుతుంది. 2020లో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్నారు. అభినవ అన్నమయ్యగా పేరొందిన గరిమెళ్ల గతేడాది మార్చి 9న గుండెపోటుతో కన్నుమూశారు.

## సంస్కృతానికి పట్టం.. వెంపటికి పురస్కారం



దేశంలోని మూడు ప్రసిద్ధ సంస్కృత విశ్వవిద్యాలయాలకు ప్రసిద్ధ సంస్కృత పండితుడు ఆచార్య వెంపటి కుటుంబ శాస్త్రి ఉపకులపతిగా పనిచేశారు. 1950 ఆగస్టు 12న కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో వెంపటి జగన్నాథం, రాజ్యలక్ష్మి దంపతులకు జన్మించిన వెంపటి కుటుంబశాస్త్రికి అద్వైత వేదాంతం, దర్శనాలు, కావ్యశాస్త్రం, సంస్కృత సాహిత్యంలో సుప్రసిద్ధ సంస్కృత పండితుడిగా పేరుంది.

## నాటి.. నేటి తరాల సినీ వారధి మురళీ మోహన్‌కు పద్మశ్రీ



తెలుగు చిత్ర పరిశ్రమలో సౌమ్యుడిగా పేరుగాంచిన సీనియర్ నటుడు మాగంటి మురళీ మోహన్‌ను పద్మశ్రీ వరించింది. హీరోగా నట ప్రస్థానం ప్రారంభించి, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, నిర్మాతగా పరిశ్రమకు ఆయన అందించిన బహుముఖ సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం వరించింది. 1973లో 'జగమే మాయ' చిత్రంతో తెరంగేట్రం చేసిన మురళీ మోహన్, 350కు పైగా చిత్రాల్లో నటించారు.

## నట కిరీటికి పద్మశ్రీ అవార్డు

తెలుగు తెరపై హాస్యానికి కొత్త నిర్వచనం చెప్పి, ఆ తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్ గానూ ప్రశంసలు అందుకున్న 'నట కిరీటి' రాజేంద్రప్రసాద్‌ను కేంద్రం పద్మశ్రీతో గౌరవించింది. హీరోగా ఒక తరాన్ని నవ్వించి, ఇప్పుడు తండ్రి, తాత పాత్రల్లో అలరిస్తున్నారు. వంశీ దర్శకత్వంలో వచ్చిన 'లేడీస్ టైలర్' చిత్రం రాజేంద్ర ప్రసాద్ కెరీర్‌ను మలుపుతిప్పింది. 200కు పైగా చిత్రాల్లో నటించిన ఆయన తెలుగు సినిమా గర్వించదగ్గ నటుల్లో ఒకరు.




**HINDU NAGARA**
Telugu Monthly, Volume : 34,Issue :02

Postal Registration No : VJ/152/2023-25, RIN No. 52882/93
Date of Publishing : 28-01-2026, Date of Posting : 06-02-2026, Pages : 16

# భారతీయ సంప్రదాయ విలువలే రక్షా కవచం

మన దేశం, ధర్మం, సమాజంపై అనేక కుట్రలు జరుగుతున్నాయని, దీన్ని అడ్డుకోవాలంటే మన దేశంలో సజ్జనశక్తి ఏకం అవ్వాలని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ గారు అన్నారు. దేశం కోసం నిజాయితీగా పనిచేసే ప్రతి ఒక్కరూ సజ్జన శక్తిలో భాగమేనని చెప్పారు. స్వార్థం లేకుండా, పదవులు కోరకుండా, నిజాయితీగా పనిచేసే వారందరూ మనవారే అని, సంఘటిత సమాజశక్తితో ధర్మాన్ని రక్షిస్తూ, దేశాన్ని గౌరవ శిఖరాలకు చేర్చే శక్తిని ఆ భగవంతుడు ప్రసాదించాలని కోరుతున్నట్లు ఆయన తెలిపారు. ఆర్ఎస్ఎస్ 100 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా విజయవాడ స్కూల్




ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్‌లో వివిధ రంగాల్లో అనుభవజ్ఞులైన 45 ఏళ్లలోపు వారితో 'భవిష్య భారతం– దృష్టి దిశ' నిర్వహించిన రెండు రోజుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశ జనాభా అందరూ సంఘటితంగా ఉండాలని చెప్పారు. సినిమాలు, రాజకీయాల ద్వారా కాకుండా సజ్జనశక్తి ద్వారా హిందూ సమాజ బలం, హిందుత్వం బలం అందరికీ చెప్పాలని సూచించారు. ఇది సాకారమైతే స్వార్థంతో ఉన్నవారూ మారతారుని, హిందువులు దూకుడుగా ఉండాల్సిన అసవరంలేదు కానీ బలంగా ఉండాలని మోహన్ భాగవత్ స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్‌ను అర్థం చేసుకోవాలంటే దూరం నుంచి కాదు, లోపలికి వచ్చి అనుభవపూర్వకంగా తెలుసుకోవాలి అన్నారు.

సమాజ శ్రేయస్సు కోసం మాత్రమే పనిచేసే స్వార్థరహితులు, నిబద్ధత, ప్రజలతో ప్రత్యక్ష సంబంధం ఉన్నవారు సంఘటితం కావాలని, అలాంటి వారిని తీర్చిదిద్దడమే ఆర్ఎస్ఎస్ ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. కలిసి జీవించడం, పనిచేయడం, అడుగులు వేయడం, ముందు సాగడం ఇదే ధర్మమని అన్నారు. ధర్మం అంటే కేవలం మతం కాదు, జీవన విధానమని తెలిపారు. ఈ ధర్మ భావన ఆధారంగానే భారతీయ జీవన సంప్రదాయం రూపుదిద్దుకుందన్నారు. హిందుత్వ భావనకు మూలం సమస్త సృష్టి ఒకటే అనే అనుభూతని అన్నారు. అదే ఏకత్వ భావన అని తెలిపారు. ఈ సత్యాన్ని మన రుషులు తమ అనుభవాల ద్వారా గ్రహించారని తెలిపారు. ఆ అనుభూతి ఆధారంగా ఏర్పడిన జీవనధార వంటి భారతీయ సంస్కృతి పై చరిత్రలో ఎన్నో దాడులు, మార్పులు, కష్టకాలాలు వచ్చినా మన మౌలిక ధర్మ భావనను ఏనాడు మనం వదల్లేదని, అదే భారతీయ ధర్మ పరంపర బలం అని వెల్లడించారు. లౌకిక, సామ్యవాదం, ప్రజాస్వామ్యం అన్నింటికీ భారతీయ సంప్రదాయ విలువలే రక్షణ కవచం అని అన్నారు. విలువలు తరతరాలకు అందించాలంటే మాతృభాషలో విద్య తప్పనిసరి అని, ఆంగ్ల మాధ్యమం కోసం పోటీ పడుతూ స్థానిక భాషలను నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరమని అభిప్రాయపడ్డారు. భారతీయ భాషల్లో చదివితే సంప్రదాయ భావోద్వేగాలు, నైతిక విలువలు, సాంస్కృతిక అవగాహన సహజంగా పిల్లలకు అబ్బుతాయని చెప్పారు.



Published by : Tulasi Surya Prakash on behalf of Sahiti Sudha Foundation from Madhavasadan, Kaleswara Rao Road, Governorpet, Vijayawada - 520002 and Printer Chiruvolu Vasu Deva Rao and Printed at : B.S.R. Enterprises, D.No: 32-26-110/6, Narra Gopala Krishnaiah Street, Maruthi Nagar, VIJAYAWADA - 520004, Editor : Chiruvolu Vasu Deva Rao, Cell : 9490923439